భాగవతుల

# కూచిపూడి



నాట్యాచార్య

వేదాన్తమ్ పార్వతీశమ్

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No. 14531

894.8271
PAR

Dr. B. R. AMBEDKAR
OPEN UNIVERSITY
LIBRARY
HYDERABAD-500 033

# భాగవతుల
# కూ చి పూ డి

∴

నాట్యాచార్య

## వేదాన్తమ్ పార్వతీశమ్

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N11531

~~బుక్ సెల్లర్స్ అండ్ పబ్లిషర్స్~~

~~వి జ య వా డ~~-1

V. పార్వతీశము
కూచిపూడి, P.O. (Via) పెదసన గల్లు
కృష్ణా జిల్లా

కాపీరైటు రిజిష్టర్డు మూల్యం 0-8-0

హక్కులు

గ్రంథకర్తవి

894.8271
PAR

ii

★

నందన

వసంతము—౧౯౫౨

★

తొలికూర్పు:

ప్రతులు ౧౦౦౦

★

మూల్యం

0—8—0

★

జైహింద్ ప్రెస్,

తెనాలి.

AOUA105B121

1

# పరిచయం

ప్రకృతి సహజసంపదావలోకనమునను — విషయపరిశీలనాఫలితముగను
మానవునకు మనోగత భావ సృష్టి కలుగుచున్నది. ఏతద్భావోద్ధృతములే
రూపకల్పనములు రచనా రూపములును. రూపకల్పనజేయునాతడు శిల్పిగను,
రచనల రూపించువాడు కవిగను వాకొనబడుచున్నారు.

మొదటిది శిల్పము, రెండవది కవిత్వము. కవి శిల్పులు లోకకల్యాణ
కారకులు. "మానిషాద........" అను వాల్మీకి వచన మిట్టులనే ఉద్ధృత
మయినది. కవి తన భావసమాధిలో నిహపరలోక వృత్తముల యదార్థ
రూపముల నవలోకించుకొని తన తపస్సిద్ధిని రచనారూపమున లోకమున
కందించును. తత్ఫలితానందము లోక మనుభవించును. లోకమున కనుభ
వజ్ఞత కలిగించుటకే యాతడు వివిధవిషయములను వివిధానుగతుల రచనల
సాగించును. గద్యములు — పద్యములు — గేయములు — యక్షగానము
మున్నగున విట్టి కారణజన్యములేయగు. ఇయ్యవి సాధించుటలో(రచించుటలో)
కవి తన కూర్పరితనమునకు నేర్పరి తనము జోడించి విశిష్టస్థాన సంపాదనము
నకు సదా బ్రయత్నించును. ఈ ప్రయత్నమున నొక్కొక్కతరిగాని, కొండొక
పట్లగాని నాతడు విఫలత్వము బొందుటకూడకద్దు. ఇది కవికి ప్రథమ
ప్రయత్నమున దొరలుచుండును. అద్దాన కవియెన్నడు తన ప్రయత్నమును
జారవిడువడు. విఫలుడనైతినని కూడ నాతడూహింపడు. తన భావమును
రూపించుటలో శబ్దప్రయోగమున నాతడు శ్రద్ధవహించుట పైననే నిట్టి ఫలితా
ఫలితములు కలుగుచుండును. ఒక వ్యక్తి యెన్నడు భావమునకు పేద కాడు.
భాషకు మాత్రమే పేద కావచ్చును. తన సముపార్జిత విద్యను బట్టి యాతనికి
భాషాశ్రీ యబ్బుచున్నది. తనసముపార్జితానుభవమున భావశ్రీ యుదయించు
చున్నది. కావున నొకొక కవి తన భాషాజ్ఞాన ప్రాకారపు గోడలమధ్య శబ్ద
యుత భావ సౌధమును సాధ్యమైనంత అందచందములుగ నిర్మించి లోకమున
కందించును. ఆనాటి కానాడనుభవజ్ఞుడై పరిసరభావ సౌధముల ప్రత్యేకత
పరిశీలించుకొని, వాటికి దులతూగు నిర్మాణానుభవము గడించును. పెద్ద కవు
లనుకొను వారిట్టి సాధనముననే గణుతికెక్కిరి. ఇవి కవితాజగత్తులోని కీలక
స్థానమునకు బోవు సోపానములు. ప్రతికవియు విశిష్టస్థానమునకే ప్రయత్నిం
చును. సాహసించును. కవితా వీధుల నిట్టి పల్లములలోని మర్మమింతియు.

ప్రస్తుత మీ గ్రంథకర్తయు నిట్టులనే తన భావ జ్యోతులతో తనదగు భాషావని గాలించి ఏర్చికూర్చి కొన్నాడీ గీతాసుమములు. ఇందీతని ప్రథమ ప్రయత్నము కొంతకుగొంత కవితా ప్రాంగణమునకు గొంపోయినది. ఈ నవకవి నాట్యకళాధురంధరుడు. అనుపూర్వికముగ నాట్యకళకొక చక్కని స్థాయి, హాయి చేకూర్చి నాట్యలక్ష్మీకల్యాణ సౌభాగ్యముల నిలబెట్టిన భాగవతుల కూచిపూడీతని జన్మస్థానము. తెనాలికి నాట్యశిక్షణా గురువుగా నేతెంచుట జరిగినది. లలితకళానుగతమగు వంశమున జనించుటచే నాకును లలితకళలన్న, వాకబ్బకపోయినను — మహాప్రీతి. దానవీతని మైత్రి కళాభిమానియగు శ్రీ వేంకటేశ్వరరావుగారి వలన కలిగినది. నాకు పరిచయమైన నాటనుండీతని లోలోపల నేదోయొక విశిష్టత చేయూతలేమి తెమల్చుకొని బయట బడలేక నుక్కిరి బిక్కిరి యగుచున్నట్లు గ్రహించితిని. అట్టిదేమో తెలిసికొనలేక నేనును కొంతకాల ముక్కిరి బిక్కిరినైనానన్న నమ్ముడు. నాకష్టమును బోగొట్టుకొనుటకై యాతనిలోనుండి తెమల్చుకొని బయట బడని దానికై యన్వేషించి, ఒక కవిత్వపుజాలు ఛందోలక్షణపు శిలలచే నడ్డుపడియుంట గ్రహించి, యవ్వానిని తొలగించగనే "భాగవతుల కూచిపూడి" అను యీ కావ్యరూపమున నాతని కవితాలహరి జాలువారినది. దానవీకవికిని నాకును నుపశమన మేర్పడినది.

కవితారంభము — కావ్యరచన కవల పిల్లలవోలె వెలువడినవీ కవితొలి కాన్పులోనె. ఈతని శ్రద్ధాభక్తులే సరస్వతీదేవి మెప్పులనుసిద్ధింప జేసికొన్నవి.

ఈ కావ్యమును కవిమూడుభాగములుగ చిత్రించినాడు అందు మొదటిది స్తోత్రములు — రెండవది కూచిపూడికి నాట్యకళ అబ్బిన విధానము — మూడు అగ్రహారోత్పత్తి. రెండుమూడుభాగములు కథాసారాంశమును దెల్పును. సిద్ధేంద్రుడు కూచిపూడి చేరువకరుదెంచుటయు, బాలురను కనుగొని వారితో గ్రామము జేరుటయు, గ్రామాచార్యుడా సిద్ధేంద్రుని గౌరవభక్తులతో భిక్షకై పిల్చుటయు, సిద్ధేంద్రుడటకుంజని యక్షగాన విషయము చెప్పుటయు — బ్రాహ్మణ్యము భయకంపితులయ్యు, తుదకంగీకరించి నాట్యశిక్షితులగుటయు సిద్ధేంద్రుడు శంకరస్వాముల వారికడ కరిగి ఆంక్షతొలగించి తెచ్చుటయు మున్నగువిషయములు చాల హృదయంగమముగ చిత్రించినాడు. అగ్రహారోత్పత్తిలో తానీషాగమనము చక్కగవర్ణింపబడినది. పద్యములు ధారాశుద్ధికలవై

ద్రాక్షాపాకమును బురడించుచున్నవి. తాను కలము పట్టినందుకు ప్రప్రథమున తన జన్మభూమిపైగల యవ్యాజానురాగమున

"కన్నతల్లికి ఋణమీగ గల్గి జన్మ
భూమి చరితంబు రచియింప బూనినాడ......"

అని శ్రీ సరస్వతికి జెప్పుకొని తోడ్పడుమని ప్రార్థించినాడు. కథనునడిపించు పట్ల సందర్భశుద్ధిగ పాత్రౌచిత్యతకు భంగమువాటిల్లకుండ రూపించినాడు. 'భామ సమిధల నందీయ సోమయాజి' అనునదెంతో సాంప్రదాయముగ చిత్రింపబడినది.

'అడబోతీర్థమును నెదురైన యట్లు' "కానిండు" మున్నగు జాతీయముల ప్రయోగించుటలో కవిలోకానుభవము కన్పడుచున్నది.

జాతవేదుని జ్వాల సంచలన మెపుడు
ఋత్విజుల స్తోత్రములను కేరింతలాడు.

* * *

పింజమబ్బుల తెరదీసి సంజవేళ
చెట్లచాటుగ దిలకించె శీతకరుడు.

* * *

..........................ముకుళపద్మ
కన్య తననాథుకై యేడ్వ, కలువకన్నె
వికసితోజ్జ్వల వదనయై వెక్కిరించె.—అనువర్ణనలను అలంకారములను నీ కవి తేట తెలుగులో వెల్లివిరియించినాడు. ఇట్టివి ఈ చిన్ని కావ్యము నుండి మేలిరకపు దినుసుల నెన్నియేని జూపవచ్చును. విస్తరభీతిని వ్రాయగడంగను. పాఠకలోకమియ్యది గ్రహించి యాశీర్వదించునని మానమ్మిక. మున్ముందీకవి పెక్కు కావ్యముల వెలువరించి ఆంధ్రభాషాతల్లి కీర్తిని సుప్రతిష్టము చేసి పేరుగాంచగలడని మా ఆశయము. ఆశీస్సు. నాట్యకళతో బాటు కవితాకళయు నీతనికి రాణించుట కానటరాజు సదా తోడ్పడుగాక యని మా సంప్రార్థన.

—ఏలేశ్వరాచార్యులు

# విజ్ఞప్తి

రచయిత

నా జీవిత చరిత్రలో నాయీ గ్రంథరచన ఒక నూతనాధ్యాయము. బాల్యమాదిగా నాట్యకళాశిక్షణలో పెరిగి అంతో యింతో నాట్యకళామతల్లి పాద సందర్శన భాగ్యమందికొంటిని. ఉచ్చారణ దోషములు పొరలకుండ రాగానుయుక్తముగ, కీర్తనలు—పద్యములు భావప్రకటనచేయుచు నాడి పాడుట మా కూచిపూడికి వెన్నతో బెట్టిన విద్య. అందువలన పద్యార్థములోని భావము లప్పుడప్పుడు నన్ను ముగ్ధుని చేయుచుండెను. దాననే నమితానందముపొంది అవ్యక్తమగు కోరికల కగ్గమైతిని. కాని నాకోరిక లెటు తీరిక లెత్తించవలెనో దోచెడిదిగాదు. వ్యథజెందెడివాడను. ఏవంవిధి కొంత కాలము గడచినది. ఇట్లుండ శ్రీ కోణతాలపల్లి వేంకటేశ్వరరావుగారు తన మనుమరాలగు చి. కృష్ణకుమారికి భరతనాట్యశిక్షణ గరపుటకై నన్ను తెనాలికి గొనివచ్చినఅనంతరము మధురకవి శ్రీ ఏలేశ్వరాచార్యులుగారి పరిచయభాగ్యమబ్బినది. శ్రీవారికి నాట్యకళయన్న కడుప్రేమ. కాక లలితకళలపై అంతులదోలగించి బ్రాహ్మణ్యము పేరునిలబెట్టిన కూచిపూడి వారిపై అభిమానము మిక్కుటము. వారు మావారని పదింబది చెప్పుచుండెడివారు. నాచే భామకలాపము—కందార్థములు—యక్షగానము విని అందలి కవితారీతుల కుబ్బితబ్బిబ్బులై, వాటి అంతరార్థములు నిగూఢార్థములు నాకు వినుపించుచుండెడివారు. నేనునూతనాంశముల నెఱిగికొను ఒకనూతనతత్త్వ మలవఱచుకొంటిని. ఒకనాడు నావెన్నుచఱచి, భుజముదట్టి రచనల సాగింపుమని ప్రోత్సహించినారు. హుషారుగా పల్లెయంటిని. తరువాత శ్రీ వారిని నేను మిత్రుడుగా గాక గురువుగా భావించితిని. వారు మాత్రము నన్ను మిత్రుడుగనే భావించుచుండిరి. అదివారి తత్త్వము. శ్రీవారి వాత్సల్య ప్రభావముననే, నేనుకలము బట్టి పద్యములు వ్రాయసమకట్టి యీ 'భాగవతుల కూచిపూడి' అను కండ్రికను వెలువరింప జేయగలిగితిని. హరిః ఓం అని కవిత్వము ప్రారంభించుటయు—కావ్యమారంభించుటయు ఒక్కసారిగనే జరిగినవి. ఇది గురు కృపావిశేషముగ భావింతును. కవితామతల్లియు నన్ను బాధలుపెట్టకపోలేదు. కాని గారామున, మారామున, నాయమనుపాసించి మొండికేసిపాదసన్నిధి గూర్చుచుంటిని. ఆశీస్సుల బొందితిని. జన్మభూమి చరితము రచించి తల్లిఋణము దీర్చుకొంటిని. ప్రాజ్ఞులు నా ప్రథమ ప్రయత్నమును మాత్రమే గైకొన ప్రార్థన. కవితల్లజులకు, పాఠకమహాశయులకు నా నమస్కృతులు. సెల

## త్రాకం

కవితాసంస్థానం
విజయవాడ.

ఇతఁడు మారసరాజు కవితకు హితుఁడు
కూచిపూడిభాగవతమ్ము పూచుసుతుఁడు
కవన భువనాల వేదాంతకవికి నతుఁడు
తెనుఁగుతల్లి నోములతోఁట తేటకాఁగ.

అమృతగాన కవితారస గంగాధరుడై యీ కవికుమారుఁడు "శ్రీ ఏలేశ్వరాచార్య సునామధేయుని" యేలుబడితో లలిత కవితానాట్య కళా శిల్ప బృందావనాన్ని జగత్కీర్తి ప్రభూతంగా పూఁతపట్టించి కాఁపుకాయించి అప్సరసలకు భంగిమాలు గరపగలడని విశ్వసిస్తున్నా.

ఆంధ్రబెర్నార్డ్‌షా
**వేదాంతకవి**
12—4—52

# అంకితము

నూటపదియారు రతనాల కోటలోని
పద్యములల, కళాప్రియులకు, భరతనాట్య
వహాడి కూచిపూడికి నక్షయముగు వేంటి
కీర్తి గూర్చినవారి కంకితముజేతు.

రచయిత :

## భాగవతుల
# కూచిపూడి

★

## నటరాజు

శ్రీసతీలాస్య గౌరవ శ్రీలఁజూచి
తనకునై తానె యుప్పొంగి తాండవించు
శివుడుమా పతి నటరాజు సిద్ధమూర్తి
యిచ్చుగావుత సిరులను నిపుడు నెపుడు.

## విఘ్నపతి

ఆదరంబుగ పార్వతి యంకమందు
జేరి దుగ్ధంబుగొను వేళ చిన్నినగపు
టోరచూపులు నాపయి నొక్కమారు
బరపుమో విఘ్ననాథ నిన్ బ్రస్తుతింతు.

ఎపుడు శుభకార్య మమరునో యెవరునిన్ను
మున్న బూజించి యుండ్రాళ్లు ముద్దకుడుము
లిడుదురోయంచు కడుపాశ కెదురుచూతు
వటులే నేను కవితాశ కగ్గమైతి.

నాడు పార్వతి జలకంబు లాడనిన్ను
కావలిగ బైటనుంచ చికాకుపరచె
శంకరుండు; నేడైన యేజంకు లేక
కాపుగానుండు నాదగు కావ్యమునకు.

## సరస్వతి

కాళిదాసుకు కవితను గట్టబెట్టి
దండిఁగవి యంచు బొగడెడి తల్లి, పోత
రాజు కూర్మిబిడ్డగుచు వరాలుగూర్చి
వెలుగు వాణి, మదాత్మలో వెలయుగాత.

కన్నతల్లికి ఋణమీఁగగల్గి జన్మ
భూమిచరితంబు రచియింప బూనినాడ
కేలుమోడ్చెద తోడ్పడు కీరవాణి
రాణి శర్వాణి గీర్వాణి రమ్యపాణి.

## గురువు

గారవంబున ననుబిల్చి కావ్యలక్ష్మి
సిరులు రుచిజూపి ఛందస్సు పరువ మిడియు
శ్రీ సరస్వతి గొల్వగా జేసినట్టి
గురుని "ఏలేశ్వరాచార్యు" గొలుతు భక్తి.

## నాట్య గురువులు

ఆంధ్రనాట్య పితామహుండనగబరగు
వేంకట రామాభిధానుండు విబుధ వరుడు
నాంది పూజలనందు నా నాట్య శిక్ష
ణముకు కేలో్మ్రెడ్తు భక్తివిన్నాణ మెసగ.

భంగిమల నంద చందాలు భావపటిమ
మెరుగులును తీర్చి దిద్దిన మేటిఘనుడు
రమ్యగుణుడగు నాయన్న రాఘవయ్య
కంజలి ఘటింతు సంతతా నందమునను.

యక్షగానంపు బోకడ లక్ష్యయముగ
నాటినగురుండు నా చిన్ని నాన్న రామ
కృష్ణయాఖ్యుని, నటులె సంగీత గురుని
నాదు పెదతల్లి కొమరుని, నమ్మినాడ.

## తలి దండ్రులు

అష్టకష్టంబులకునోర్చి యతిముదాన
జదువు సంధ్యల నేర్పింప జాలి సత్య
ధర్మ పథముల నడిపిన తల్లి దండ్రు
లకును సాష్టాంగమిడుదు నుల్లాసమునను.

# వంశావళి

చరణ కింకిణీ ఝణఝణం ఝణాల సొంపు
లాంధ్రమున నింపి పేర్గన్నయట్టి నటుడు
వైశ్య దేవాది క్రతువులన్ వరలు నాదు
తండ్రి వేంకటాచలపతి యుద్ధారగుణుడు.

వసుమతీయాన "సౌభాగ్యవతియు" గనియె
సుతుల మూవుర-మువ్వుర సుగుణవతుల,
నందు జ్యేష్ఠుండు నరసింహు డనగ, మధ్య
ముండు సూర్యనారాయణాఖ్యుం డనంగ.

పార్వతీశుడ కడగొట్టు బాలుడౌదు
నేను; నభ్యసించినవాడ నేర్పుమీర
భరతనాట్యంబు సుజనులబ్బురమువడగ
కవిత నల్లుదు గురుకృపా కలిత మతిని.

నాదువంశజులెల్లరు నాట్యమునను
వేదమున జ్యోతిషంబున వాదమిచ్చి
శూలినైనను నటు తమ్మి చూలినైన
మేలమాడుచు మెప్పించు మేటిమగలు.

## జ్యేష్ఠ సోదరుఁడు

వేదకర్మేందిరకు తమ్మి విరులసెజ్జ
ఆంధ్రభాషా మతల్లికి యనుగుపజ్జ
అతులితంబగు ప్రేమనిండారు బొజ్జ
నాగ లక్ష్మీ నృశింహుండు నాకునోజ్జ.

కోతి కొమ్మచ్చులో లేక గోడు బిళ్ళొ
ఉప్పుపట్టీలో చెడుగుడో యూపిరింత
సలుపకను నాడు నన్ బట్టి చక్కదిద్ద
వెన్నుదన్నిన నన్ దన వెంటనిల్పు.

కంటికిని రెప్పవోలెను గాచువాడు
తనకు లేకున్న నేమాయె తమ్ములకును
పెట్టువాడయి సోదరప్రేమ నెరపు
అన్నఋణమీగ నేర్తుమే యెన్నడైన.

## కవిస్మృతి

ఆంధ్రగీర్వాణ కవులను నభినుతించి
కావ్యరచనకు మున్న శ్రీకారమిడుదు
కాకవులగూడ నిందింతు కావ్య సాంప్ర
దాయరీతిని విబుధు లుత్సాహపడగ.

# ప్రారంభము

స్వామి సిద్ధేంద్రుడన నొక్క సాధువరయ
పారిజాత ప్రబంధము పరమప్రీతి
యక్షగానంబునను వ్రాసె నక్షయముగ;
నాట్యమాడించిచూడ మనంబు వెలసి.

క్షేత్ర మెరిగి విత్తనము సంక్షేమముగను
నాటురీతిని పాత్ర విన్యాసమొసగ
వారణాసి యాత్రకలసి వచ్చునంచు
జోడుభావంబులకు నెల్ల మోడిగలిపి.

ఏ మహానది జలముల నింత గ్రుంకు
లిడిన కిల్బిషమడంగు నా కృష్ణవేణి
కుపనదియగు భీమనదియు యుద్భవించె
నాడు భీముండు గదజార్చి నడువ నంద్రు.

స్వామిసిద్ధేంద్రు డల్లన భీమనదికి
చేరువకువచ్చి విశ్రమించెను శ్రమంబు
దీర; యపుడు వినెనతండు దివ్యసామ
వేదగానంబు కోయిలల్ వినుచునట్లు.

సోమగేరెడు మోముల సోయగంబు
నాటి వామనరూప మెన్నదగువారు
చిలుక పలుకుల బులిపించు పలుకు బలుకు
చున్న బాలుర నలువుర జూచియతఁడు.

నాల్గు మోముల వానినే నాట్యమాడ
జేతు రీవటువులరయా; క్షేత్రమిదిర
యంచు సమ్మోదమంది అయ్యారె, వీరె
తనదుకోర్కెలుదీర్పంగ తగుదురంచు.

మోదు మనమున తలఁపులు మోసులెత్త
ఆడబోతీర్థమును నెదురైనయట్లు
వాడజాడలు తెలియంగ వాంఛగలిగి
చేరబిలిచియు వారిని సిద్ధుడంత.

వినుడు నా తండ్రులార యీ వేళమీర
లేల రా కారణంబు — మీరెందు నుండు
రయ్య — మీరెవ్వరయ్య — మీనెయ్యమిపుడు
వలయు — మీతోడ వత్తు మీవాడకనిన.

ఒకరి మొగములు నొకరొకరొగినిజూచు
కొంచు, గుసగుస చెవిబల్కుకొంచు, వంచ
కాడొ మంచివాఁడొ యెవరు గాన గలర
టంచు చింతించి స్వామితో ననిరి యిట్లు.

అల్లదే చూడుము గురుకులాశ్రమంబు
కూత వరువుననుండెను కూచిపూడి
యనగ, కృష్ణుని చెలికాడట కుచేలు
డుండెనని చెప్పుకొందు మాయూరిబుధులు.

రంగు మాతో డగలిసి బిరాన జేర
గలము జాగాయె మావారు కారణంబు
తెలియక చిరాకు బడుదురు దినకరుండు
బరుగిడుచు నుండె నాకాశపథమునందు.

అంచు సమిధల మోపెత్తికొంచు నడువు
డంచు, మాగురువు దయాళుడంచు సోమ
యాజి యంచు భూదేవాలయంబునందు
విశ్రమించు డంచును జేరి రాశ్రమంబు.

హోతలెల్లరు వరుసగా యుపనిషత్తు
లపఠన సలుప స్వాహాలు రమ్యనాద
ములు చెలంగ హోమ మొనర్చె ముదమువిూర
భామ సమిధల నందీయ సోమయాజి.

జాతవేదుని జ్వాల సంచలనమెపుడు
ఋత్విజుల స్తోత్రములను కేరింతలాడు
నంచు పంచాగ్ని కీల క్రొమ్మించు వెనసె
యుల్లసలరెడు వేడుక లెల్లజూడ.

యజ్ఞ యాగాదు లొనరించు ప్రాజ్ఞులెల్ల
కదురు వడకుచు "ఘన" "జటా" గానములను
కార్యదీక్షల జొప్పించి కరువులేని
జీవయాత్రసాగింత్రు సద్భావమునను.

సామగానము విని మదిసంతసించి
సోమయాజుల నెల్లర జూచిజూచి
అల్ల రఘురాజు పాలనం బౌరయంచు
సార్థకత జెందె కృతియంచు స్వామి మురిసి.

రామలింగేశు నాలయారామమందు
విశ్రమించెను రెండవ విశ్వకర్త
యనఁగ, నతడున్నయునికి నేమనగ గలము
నివురు గప్పిన నిప్పు నెన్నిన విధంబు.

భేదబుద్ధియు లేకింత సాధుజనుల
నతిథి నభ్యాగతుల పూజ నర్థి జేయు;
భాష్యములు శిష్యకోటిచే పలువిధముల
సంత వేయించు నాశ్రమాచార్యుఁ డొకఁడు.

సంత వేయుచు శిష్యులు చెంతరాగ
అలబృహస్పతియా యేమి ? యనుకొనంగ
పండు మోమున చిఱునవ్వు పరిఢవిల్ల
భిక్షకై బిల్వవచ్చి సాపేక్షతోడ.

స్వామిసిద్ధేంద్రు పదముల సాగిమ్రొక్కి
నాదుజీవితమెల్ల ధన్యమ్మొనర్ప
భిక్షుగైకొన బ్రార్థింతు పేర్మితోడ
నంచు నెంతోఁగ నుతియించె మించువేడ్క.

స్వామిభిక్షకు నపరాహ్ణ సమయమందు
వేద పారాయణము జేయ వేగరండ
టంచు బ్రాహ్మణ్యమున్ జీరె యంతకంత
కతిథిపూజలు మనసున్ దావహింప.

మెండుగాలికి పై శాటి తాండవింప
దండమరచేత సువిలసితమ్ము గాగ
అపరశంకరుఁడన స్వామి యపుడు లేచి
మమత వేంచేసె నాచార్య మందిరముకు.

స్వామి పాదంబు కడిగియు సరసజేరి
సురటి వేయుచు, ధన్యుండ సుకృతిపండె
నంచు నాచార్యుడాపోశనంబు నీయ
స్వీకరించక భీష్మించె సిద్ధుడంత.

ఎల్లవారలు విభ్రాంతి నింతదవిలి
యేమియపరాధమాయెనో యెరుగలేక
తహతహంబడి యేమేమొ దలచి తుదకు
వినయ మిగురొత్త బల్కిరి విమలమతిని.

స్వామి! యపరాధ మేమిటి ? శంక లేక
దెల్ప వేడెదమయ్య ! ఓదివ్యచరిత
కేలు మోడ్తుము మము నాలకింపుడిపుడ
టంచు ప్రార్థింప, నవధూతయనియె నిటుల .

వేదవిదులార ! మామకవిరచితంబు
పారిజాత ప్రబంధము పారితోష
మీయదలచినాడను; నాయభీష్ట మదియు
మీరు నాట్యమాడ జూడ గోరినాడ .

వాడ వాడల వెతక నెవ్వాడుగాని
తగుసమర్థులు దొరకమి తల్లడిల్లి
మిమ్ము గాంచితి నేటికి; మీరు సమ్మ
తించకున్న దిన; ననుగమనించుడన్న .

విన్నవారల మోములు చిన్నవోయి
కన్నమాకున్న కీర్తి పోకున్నయంచు
మన్నుపాలౌను బ్రాహ్మ్యము సన్నుతింతు
పున్నెముండును భుజియింపు మన్నమాని .

సంశయంబులదీర్తు మీ సరసనుండి
చింతవీడుడు మీరలు జిత్తమందు
భగవదనుమతమౌనీ ప్రబంధ రచన
పాడియాడుట విప్రుల పాలిసొమ్ము

* * *

కోర్కెదీరక దినమంచు ఘోరదీక్ష
బట్టినాడు; పాలింపకున్నట్టి శాప
మిచ్చు; బ్రాహ్మణ్యంబుబోవు; దైవేచ్ఛదాట
నెవరితరమంచు దురపిల్లి రెల్లవారు.

తప్పదంచును చివరకు నొప్పుకొంచు
స్వామి మీకోర్కె దీర్తుము సంశయంబు
వలదు, కానిండనగ యతివరుఁడు మెచ్చి
భిక్షగొనియెను నిజకార్య దక్షుఁ డగుచు.

కాలయాపన జేయక బాలురకును
వేడ్క సుముహూర్తమున భామవేషమాది
యాటపాటల మొదలిడె యతివరుండు
కాలచక్రము ననుకూల గతుల నడిచె.

ఒకనికిని కృష్ణ వేష మింకొకని భామ
వేషమున తీర్చి దిద్దెను వింత గొలుప
ప్రక్కపాటకాచార్యు నభ్యాసపరిచె
నాల్గుమాసాల పూరించె నాట్యశిక్ష.

ప్రక్కపల్లెల జనులతో బిక్కటిల్ల
నాశ్రమంబున నొకనాఁడు నాటనడిపె
సత్యభామయు, కృష్ణుని సరసములను
విన్న ప్రేక్షకతతి కతి వింతగొలుప.

ఎంతచక్కఁగనాడిరి, వింతదోచె
నంచుబల్కు వారెట గాంచి యెపుడు నెరుగ
మంచు జింతించు వారును, సౌర! మనదు
పూర్వపుణ్యంబ యిదియని పొగడు వారు :

నైరియాచోట్టి ప్రేక్షకులంత స్వామి
దగ్గిరసజేరి సిద్ధేంద్ర! తమరు నాట్య
కళల దనిపించితిరి మమ్ము గాన, మేము
మీదుఋణమీగు టెటులని మించువేడ్క :

సోమయాజులెల్లరు నౌరంతో, చోద్యమంది
మనసునఁ గల శంకలు మరచిపోయి
ధన్యతఁ బొందె నౌర మా తనువులంచు
స్వామిసిద్ధేంద్రు పదముల సాగిమ్రొక్కె.

నాదుకోర్కెను నెరవేర్చి నారు మీ మ
నంబు నిస్సంశయము జేయ నాకుమిగిలె
శంకరాచార్యునకు జూపి సంశయంబు
దీర్చు దీక్షయు నాటితో తీరఁగలదు.

పంపుడయ్య మీ తనయుల భయము లేదు
అల్లపీఠాధిపతులకు నెల్లజూపి
యెల్లవారి మనోభీష్టమెల్ల గొనియు
నారు నెలలకు నే తెంతు ననియె స్వామి.

మీకు నిష్టమౌరీతిని మెలగుడయ్య
మా మనంబుల శంకలు మాసిపోవు
మందమతి మేము బల్కిన మాటలెల్ల
మరచి పొందనివారు సన్మైత్రిబలికి.

ప్రక్కపాటకాచార్యుండు బయన మాయెం
శిష్యులెల్లరు వరుసగా చెంతనుండ
నాట్యరమణీస్వయంవరణంబు గోరి
వెడలె భూసురులాసీస్సు లిడుచు నుండ.

సర్వమతముల వారికి సామరస్య
భావ మేపారజేసి సబాంధువనగ
పేరుగాంచిన శృంగేరి పీఠమునకు
శిష్యవర్గంబు వెంటరా జేరెగురుఁడు.

శంకరాచార్య బదములసాగి మ్రొక్కి
భక్తి కేల్మోడ్చి తనదు ప్రబంధరచన
యక్షగానంబు వినిపించి యవల నాట్య
మునకు సెలవీయ నడిగెను వినయమునను.

వల్లెయని శంకరస్వామి వల్కినంత
పట్టరానంత సంతోష ముట్టిపడఁగ
నేటిరాత్రికి యాటంచు మాటజెప్పి
శిష్యులకు వేషములుగట్ట సిద్ధపరచె.

తాంతకిట తాంతకిట తోంత తైయనుచును
స్వామి తన తాళగతుల ప్రసారమీన
చెంతనున్న నాచార్యుఁడు వంత బాడ
సభకు నేతెంచె తెరదీయ సత్యభామ.

వాసకసజ్జిక నాయిక వదనముచ్ఛ
ట దెలుప కలహాంతరిత మాటలను గోచ
రింప, ఖండిత భావంబులెల్ల జూపి
"భామనే"యంచు దరువును బట్టి పిదప.

కృష్ణుడెంతకు రామికి కినిసి సత్య
రాయబారమునంపుట, — రాకతడయ
మూర్ఛనొందుట, — రాగనే మూర్ఛ దీర
ప్రణయమున తన్నుటాదిగా పాడి చూపె.

శంకరుని దేహము పొంగి సర్వజ్ఞుఁడు
కృష్ణపరమాత్మ వచ్చెనో క్రీడ సలుప
తాను ద్వారక నుండెనో తలపలేక
కలియె ద్వాపరమయెనంచు కలత వడుచు.

గరుడంచును నాచార్యుఁ గణుతిజేసి
ఉద్ధవుండని సిద్ధేంద్రు నొద్దకేగి
గ్రుచ్చి కౌఁగిట జేరిచి మెచ్చిబలికె
నీవె శ్రీకృష్ణు చెలికాడ వింతయేల.

MEMORIAL LIBRARY
NARLA
D.P.R.I.
Acc. No.

అంచు ధన్యుండ వీవంచు నౌర నీవు
పాడ కృష్ణుఁడిటుల నాట్యమాడ నెట్టి
తపమున పొసగె మీకిట్టి తగిన పొత్త
టంచు నెంతేని బొగడుచు మించువేడ్క.

అంత్యమున వారి మంగళహారతులను
వందిమాగధ బృందకై వారమటుల
దోప కలగంటి నింక నిదురతగదని
తెలివినంది నాట్య మనియు తెలిసి మురిసె.

వింటిద్వాపరమున నిటువంటి కథల
కంటి నీకంటితోడ నాజంట నిపుడు
యెంతవారొన్న తరుగదీ వింతకళయు
నెట్టు నేర్చినారో వీరలిట్టి యాట.

అన్న! సిద్ధేంద్ర యిటువిను మాదికాల
మందు కృష్ణుఁడిటుల జేసెనంచు విందు
గాని గాంచియెరుగ, నీదు కావ్యమందు
డెలియగల్గి ధన్యుఁడనైతి దివ్యచరిత.

ఎట్టి తపముల సిద్ధించె నిట్టికావ్య
రచన, ముక్తియు హస్తామలకము నీకు
నౌర! మరపించి దోబూచులాడెనాతో
నీదు జన్మ సార్థకమందె నిజము నిజము.

బాగుబాగని యతియును బల్కుచుండ
స్వామిసిద్ధేంద్రుడంత నా స్వామితోడ
నటు లపంక్తేయు లంచును నలువురాడు
శంక దీర్పంగ వలతన శంకరుండు.

పకపకాలున నవ్వి పాపంబు గట్టు
కొనరె నటులన్న వీరిని కోవిదాళి
ముక్తికాంతను వలపించు శక్తియున్న
వీరికిని సాటి భువిలేరు లేరు లేరు.

నాలు వేదాలు పఠియించినను నొరులకు
ముక్తిగూర్పలేరు నిజము; భక్తి విష్ణు
నామముల మేళవించియు నాట్యముసను
జూప వీరలే ఘనులైరి జూడనాకు.

అన్న! సిద్ధేంద్ర నీమదినున్న సంది
యంబును విడువుమయ్యా నాయభిమతంబు
శాసనంబు గైకొనుము 'రక్ష'యని శ్రామ
శాసనంబును లిఖయించి సనదునిచ్చె.

శంకరస్వామి తనకిడు శాసనంబు
పెన్నిధిన్ గన్న పేదగా ప్రీతినంది
కొనియు, కండ్లకద్దికొనియు, కొరతదీరె
కృష్ణపరమాత్మ దివ్యమౌ కృపనటంచు.

సంతసంబున సెలవంది శాసనంబు
నెల్ల పీఠాధిపతులకు నెల్లజూపి
వారి మన్ననలంబొంది చారుగుణుడు
గురుడు శిష్యులతో జేరి కూచివూడి.

సేమమేగద "సోమయాజి" "యవధాని"
సేమమే "చెన్ను" పాకయాజి సుఖమానె;
పరగ విూ క్రతువులవియు పరిసమాప్త
మందెనేయంచు పేర్వేర నడిగె బుధుల.

విూరులేకెట్టులగు స్వామి! విూదురాక
వేచియుంటిమి మాకిలువేల్పు వీవె
గావె; పర్యటనంబునగన్న ఫల మ
దేమొ వినుపింపుడనస్వామి యిటులబలికె.

శంకరాచార్యునకు జూపసంతసించి
తామ్ర శాసనంబిచ్చె; మతగురువులగు
వారియభిమతమా యానవాలు లివిగొ
చూడుడయ్య విూరెల్లరు చోద్యపడక.

వీరె విూతనయు లివిగో వీరినాట్య
మునకు నిచ్చిన శాసనములు, మనోగ
తమ్మృదు భాషణములు సంతతసుఖతోష
ణములటంచు జూప నట నున్నట్టి వారు.

స్వామి ! మీ ఋణమెటు తీర్పజాలుమాకు
నెన్ని జన్మాల తీరునో యింత పెట్టు
బడియు, నేరీతి సరియౌనో బయలు పరచి
ధన్యజీవుల జేయుమో తాపసేంద్ర.

అనుఁడు చిఱునవ్వుతోడ నా యతివరుండు
ననియె వారల కిట్టుల, అన్నలార !
తరతరంబుల మీరలు భరతనాట్య
మాడి పాడుచు తరియింపు డదియుగాక.

బిడ్డ పుట్టిన నాదగు పేరు జెప్పి
ముక్కు కుట్టింపుడయ్య సమ్మోదమలర
కాలికిన్ గజ్జ కట్టించగలుగు నపుడె
నాదు ఋణమీగ గలరు యేనాటికైన.

తెలుపుదొక్క రహస్యంబు తేటబడగ
వినుడు ప్రతి శుక్రవారము విమలమతిని
ఆలయమునందు మీరలు నాడి పాడ
గలుగు ముక్తియు భుక్తి యుగాలు గడువ.

అనుచు సిద్ధేంద్రుడుఁ బల్క నంత సంత
సించి వారలు తమ క్షేమ మొంచిపల్కు
నుడుల శిరసావహించిన కడకు స్వామి
కాశియాత్రకు పోసమకట్టె నడువ.

కంట నీర్వెట్టి వెనువెంట నంటినడచు
వారు, యాత్ర ముగియగ మా వాడ జేరు
డంచు ప్రార్థించు వారును నైన జనుల
భక్తి భావం బదెంతయో పలుక వశమె.

## అగ్రహారోత్పత్తి

ఇట్టి కథయున్న రోజుల నీ ప్రదేశ
మెల్ల పాలించు తానీష యుల్లమందు
దలచె బందరు కోటకు దాను వెడల;
నంత సైన్య సమేతుడై యరుగుదెంచె.

అంచెలంచెల మజిలీల నచట నచట
నుండి తనయేలుబడి క్రింద నుండుభూము
లెల్ల నజమాయిషీల్ జేసి యేగుచుండ
కూచిపూడికి రాగనే క్రుంకెప్రొద్దు.

తనదు ప్రియురాలు విరహాగ్ని తప్తయౌట
అల్ల పవనుండు దెల్పిన యుల్లమలరి
పింజమబ్బుల తెరదీసి సంజవేళ
చెట్లచాటుగ తిలకించె శీతకరుడు.

అకట! యిదియేమటంచును ముకుళపద్మ
కన్య, తన నాథుకై యేడ్వ, కలువకన్నె
వికసితోజ్వల వదనయై వెక్కిరించె
తనదు పతిరాక చూచుక మనసు పొంగి.

* * *

అలసిపోయిన పరివారములనుజూచి
పయనమాపగ సుల్తాను భటులహెచ్చ
రింప డేరాలవేసి నా రేయినిదుర
నుండ రెండవ జామేగుచుండి నంత.

మధుర మధురస్వనంబులు, మృదులధ్వనుల
మారుబల్కెడి మద్దెలల్, మరపురాని
చిఱుత గజ్జెల మ్రోత విశేషములును
వినియె సుల్తాను డవ్యక్త విధిని నపుడు.

దిగ్గునను లేచి పరికించి, తిమిరతతుల
గాంచి తెలవారదంచు యోచించి పదిని
మరల శయనింప బోనంత మారుమ్రోగు
ధ్వనులు తన్బిల్చు చున్నట్లు దలచి లేచి.

భటుల లేపుక తానంత పయనమాయె
తనకు వినబడుచుండిన ధ్వనుల కొరకు
యెవరికర్ణంబు గాలెనో నిపుడటంచు
కాగడాల్ బట్టి భటులును కదలినడువ.

కొంతదవ్వేగ గన్పట్టె కోలవెలుగు,
నాటపాటలు చతురోక్తు లమితజన స
మూహకోలాహలంబతి మనోహరముగ
వినబడంగను పేమరు వింతబడిరి.

భూత భేతాళగణమేమొ భూవభోంత
రాళమటరంగనాడు నీరాత్రి, మనదు
పీకె లేనొక్క నంచును బెదరి చెదరి
చేయునది లేక భటులెల్ల జేరిరటకు.

బరిశ డాల్ కత్తి బట్టిన భటులజూచి
బందిపోటు లటంచును భ్రమసిమదిని
గుంపుగుంపులుగా లేచి గుండెలదర
పరుగులిడు ప్రేక్షకులతోడ పలికె గురుడు.

ఏల లేచియు పరుగెత్త నిపుడు మీరు
నిలుడు శత్రుల నిర్జింప గలము మనము
భీరువులవోలె బారిన యూరి పేరు
దక్కనే కూచిపూడియు మొక్కవోదె.

అంచు జనముల నదలించుకొంచు గురుడు
కాశె బిగియించి రోషసంకాశుడగుచు
నిజము నారసి యతడు తానీషగాగ
ప్రభువు ప్రభువంచు యెలుగెత్తి ప్రకట పరచ.

తమ యపోహకు సిగ్గిలి తమకు తామె
వెనుదిరిగివచ్చి ప్రభుభక్తి వెల్లడించి
రెల్లవారును గురుడంత యుల్లమలర
ప్రభువునిక దోడుకొని చని పందిలికెని.

కోరిననురాని తమయట్టి వారలిటకు
దయను వేంచేయ మా సుకృతంబుగాదె
కృష్ణుఁడేమిమ్ము రప్పించి క్రీడజూప
మాయదృష్టంబు పండెనో మాన్యచరిత.

కృష్ణపరమాత్ముఁడితడు రుక్మిణియు సత్య
భామ మున్నగువారష్ట భార్యలంద్రు
వీరి; సిద్ధేంద్రు గురుకృపా వీక్షణమున
యక్షగానంబు నాడింతు ననుచు తాను.

కేలతాళముబట్టి సంకీర్ణ గతుల
తీరికలనిచ్చి "యెందుఖోతి" వను దరువ్వ
భామ నాట్యంబు సేయ సభాపయుక్తి
కనుల విందుగ సుల్తాను గాంచిగాంచి.

కటికనేలను నాడంగ కందిపోవు
మావి చివురుల తొలికారు కీవిదెలుపు
వీరిపదములు; పరుపులన్ వేగదెచ్చి
పరచుడనరాజు భటులును భద్రపడిరి.

పట్టుబరుపుల వేయుంగ, భావగతిని
రాగతాళానుయుక్త సరాగగాన
మాలపించుచు నాట్యంబు నాడతొడగి
రంతసుల్తాను హ్వాద్యన మింతబూచి.

భామయలిగిన తనుదానె పరితపించు
విరహమొందిన తానెంతొ వెరపుజెందు
దూతికను వేడ తనమది తోడుపంపు
నవరసాకృతి దాల్చె తన్మయతనొంది.

ప్రణయకలహంబు జూచి తా ప్రణతిసేయు,
మోకరించ కృష్ణుండు తాముదము నందు,
నిటులనానంద సాగర మీదియీది
సాగుకెరటాల నూయెలల్ దూగితూగి.

కోరికలదీర్తునో సత్య కోపముడుగు
మనుచు కృష్ణుండు వేడగ హత్తికౌఁగ
లించి సత్యనీరాంజనం బిచ్చు చుండ
ముదము జెందుచు సుల్తాను మ్రొక్కెఁ గృష్ణు.

వయసు ముదిరిన వాడవు — బల్కు శబ్ద
ములను బురడించు నురుము; సమ్మోదపడితి
నిపుడ, నాచార్య బిరుదుకు నీవె తగుదు
భరత కళ నీదు హృదయాన బాదుకొనియె.

పిన్నవారలు వయసున నెన్నమీకు
నీడుజోడుగ కళలందు నిపుడ నారి
తేరినారలు — మెచ్చితి, తీసికొనుడు
అగ్రహారంబు మీకిత్తు నంకితముగ.

అనుచు సుల్తాను ప్రకటించి, యపుడు తాను
సనదు వ్రాయించి తెప్పించి సంతకంబు
జేసి యిప్పించె నాచార్యు చేతికపుడె
నాల్గు దిక్కుల విహరించె నాట్యలక్ష్మి.

నాటినుండియు నేటికి నాట్యలక్ష్మి
వేయికిరణాల కాంతులు విస్తరిల్ల
వాడవాడల తమ కళావాహినులను
పొంగులూరింతురీ కూచిపూడి బుధులు.

★

## ఫలశ్రుతి

భారతీకంఠ హారాన ప్రజ్వరిల్లు
కొలికిపూస భాగవతుల కూచిపూడి
చరితమిది; దీని పఠియించు సరసమతుల
కెలమి నటరాజు కరుణ ప్రాపించుగాత!

ఓం తత్సత్.

జై హింద్ ప్రెస్, తెనాలి.

శతావధాని, జ్యోతిర్విద్యా విశారద
శైవమహాపీఠ పండిత సభాధ్యక్షులు
బ్రహ్మశ్రీ ముదిగొండ జ్వాలాపతి లింగశాస్త్రి అయ్యవార్ల

# అభిప్రాయము

సహజకవితా స్రవంతి వాఃపానుమధుర
భావపానీయమును తెన్గువారికొఱకు
పారగాజేసె వేదాంత పార్వతీశ
కవి చిరంజీవి మునుమున్న కాగలాడు.

తానుగాబిల్చి వాణి యీతని కవిత్వ
మందుకొన్నది చేసాచి యమలకనక
కంకణధ్వానముల పెద్ద కవులచెవుల
లలిత నాట్య కవిత్వకళల్ ధ్వనింప.

ఆర్య ప్రస్తుతిగాంచజాలు కవితా యత్నంబు "ఏ లేశ్వరా
చార్యుల్" గూర్చెనటే తదీయమగు స్నేహంబెంతకుం జాలదో
ఆర్యాస్నిగ్ధ కటాక్షసంజనిత నాట్య శ్రీవిలాసంబు సౌ
దర్యంబై కవితా వధూమణియు నృత్యప్రౌఢిమన్ గాంచగన్.

---

## ◆ సవరణలు ◆

| పుట | పంక్తి | | | |
|---|---|---|---|---|
| 4 | 4 | యుదారగుణుడు | —— | ధర్మగుణుఁడు |
| 8 | 3 | చెలికాడట | —— | చెలిమికాడట |
| 13 | 9 | కొంతో | —— | కడు |
| 15 | 6 | కలహాంతరకు | —— | కలహాంతరిత |

26

BCî

AOUA105B121

BC

V.R. NARLA MEMORIAL LIBRARY *

V.R.NARLA
D.P.R.I.
Acc. No.

మనము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపత్రిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | AOUA105B121 |
| పుస్తకం పేరు | భాగవతం కూచిపూడి |
| తారీఖు | 31 December 2025 |
| ముందు అట్ట | yes |
| వెనుక అట్ట | yes |
| మొత్తం పేజీలు | 38 |
| పెద్ద సైజు పేజీలు | no |
| ఖాళీ పేజీలు | ei Bci |
| లేని పేజీలు | no |
| తయారు చేసినది | kethura |
| పేజీలు విడదీసినది | kethura |
| స్కాన్ చేసినది | [illegible] |
| పరీక్ష చేసినది | anusha |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగ్ చేసినది | |
| ప్యాకింగ్ చేసినది | |
| పరిస్థితి | [illegible] |